సాక్షి ఒడిశా

బుధవారం । 13 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 7,81,096

బంగారం : 31 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

వెండి : 214 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



గంజాయి మొక్కల ధ్వంసం

గుడారి పీఎస్ పరిధిలో గంజాయి పెంచుతున్నారు. పోలీసులు పంటను ధ్వంసం చేశారు. - 6లో



ఏనుగుల మృతిపై విచారణ

రైలు ప్రమాదాల్లో ఏనుగులు చనిపోతున్నాయి. దీనిపై విచారణకు ఆదేశించారు. - 6లో

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



జయపురం: ప్రత్యేక అలంకరణలతో శ్రీజగన్నాథుడు



జయపురం: శ్రీజగన్నాథమందిరం వద్ద భక్తులతో..



జయపురం: జగన్నాథ మందిరంలో పోటెత్తిన భక్త జనం

జయపురం: కార్తీక శుక్ల పక్ష ఏకాదశి పూజలను జయపురంలో మంగళవారం శ్రద్ధగా జరుపుకున్నారు. స్థానిక శ్రీజగన్నాథుని, శ్రీవల్లభ నారాయుని, రఘునాథ్ మందిరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ముందు ఆదివాసీ మహిళలు తామర పువ్వులతో పాటు అనేక రకాల పువ్వులు పూజా సామాన్లు విక్రయిస్తూ కనిపించారు.

పర్లాకిమిడి: కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా పర్లాకిమిడిలో వేంకటేశ్వర, సత్యన్నారాయణ, శ్రీజగన్నాథ మందిరాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు ఏకాదశి సందర్భంగా కార్తీక దీపాలు వెలిగించి ఉపవాస దీక్షలు చేశారు.

రాయగడ: కార్తీక ఏకాదశి పూజలను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ ఆలయంలో సహస్ర కుంకుమార్చన పూజలు, రామలింగేశ్వర ఆలయంమో సహస్ర లింగార్చన పూజలు చేశారు.



జయపురం: శ్రీజగన్నాథ మందిరం వద్ద దీపారాధన



జయపురం: శ్రీజగన్నాథ మందిరం వద్ద భక్తులతో..



పర్లాకిమిడి: శ్రీ జగన్నాథ్ మందిరం వద్ద భక్త జనం



రాయగడ: భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



రాయగడ: సహస్ర లింగార్చన పూజలు చేస్తున్న దృశ్యం



రాయగడ: కుంకుమార్చన పూజలు



పర్లాకిమిడి: మందిర ప్రాంగణంలో ఫలపుష్పాలు అమ్ముతున్న ఆదివాసీ మహిళలు

న్యూస్‌రీల్

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో.. సమస్యలు పరిష్కరిస్తాం

- కలెక్టర్ కీర్తి వాసన్



మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి వాసన్

కొరాపుట్: సునాబెడాలోని ఒడిశా కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నెలకున్న సమస్యలు పరిష్కరిస్తామని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ ప్రకటించారు. కలెక్టరేట్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కొంతకాలంగా మెస్‌లో ఆహార నాణ్యతా లోపం వలన విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అక్కడ యాజమాన్య కమిటీలో మార్పులు అవసరమన్నారు. అలాగే మెస్ నిర్వహణ పరిశీలించడానికి ఉన్నతస్థాయి అధికారులను పంపించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థు ప్రతి సమస్య పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కటక్ ఆస్పత్రికి శిశువు తరలింపు



కటక్ ఎస్‌ఎస్‌బీ ఆస్పత్రికి శిశువును తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిబలియ పంచాయతీ కరసాలిగుడ గ్రామంలో రెండు నెలల శిశు బాలిక వీపుపై కణితితో బాధ పడుతున్న విషయం పాఠకులకు విదితమే. శిశువు పడుతున్న బాధను తల్లిదండ్రులు పత్రికల వేదికగా పంచుకున్నారు. ఈ విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం వెంటనే ఆ శిశువుకు మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర ఆరోగ్య విభాగాన్ని ఆదేశించింది. వెను వెంటనే వైద్య విభాగ అధికారులు ఆ శిశువుకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వాదేశం చేరకు అధికారులు ఆ బాలికను కటక్ ఎస్‌ఎస్‌బీ మెడికల్‌కు సోమవారం తీసుకువెళ్లారు.

350 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కూర్మన్నూర్ పప్పులూర్ పంచాయతీల మధ్య సోమవారం రాత్రి పోలీసులు 350 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇక్కడ గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు.. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో సోమవారం రాత్రి మాటు వేసి దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన ఇద్దరు అక్కడి నుంచి పారిపోయారు. 14 బస్తాల్లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. తూకం వేస్తే 350 కిలోలు ఉందని, రూ.25 లక్షలు విలువ ఉంటుందని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్త అరెస్టు



అరెస్టైన సంతోష్ కుమార్

జయపురం: కట్టుకున్న భార్యను వేధిస్తూ, యాసిడ్ పోస్తానని భయపెడుతున్న భర్తను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి జయపురం మున్సిపాలిటీ పరిధి నారాయణతోట వీధి సంతోష్ కుమార్ భాగ్‌గా పోలీసు అధికారి రశ్మీ రంజన్ దొళాయి మంగళవారం వెల్లడించారు. నిందితుని వద్ద నుంచి బైక్ సీజ్‌చేసి, అతడిని కోర్టులో హాజరుపరచినట్లు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిందితుడు సంతోష్ కుమార్ 8 ఏళ్ల క్రితం స్థానిక సౌరావీధికి చెందిన లక్ష్మీప్రియ నాయిక్‌ను వివాహం చేసుకున్నాడు. అయితే భార్యాభర్తలకు మనస్పర్ధలు తలెత్తడంతో సంతోష్ వేధింపులు ప్రారంభించాడు. గతంలో ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. కాగా ఈనెల 10వ తేదీ రాత్రి లక్ష్మీప్రియ నివాసం ఉంటున్న ఇంటి వద్దకు సంతోష్ వచ్చి ఇంటి తలుపుపై రాళ్లతో కొట్టాడు. ఆమెను తిడుతూ యాసిడ్ పోస్తానని హెచ్చరించాడు. ఈ విషయంపై బాధితురాలు లక్ష్మీప్రియ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అతడిని అరెస్టు చేశారు. పట్టణ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ దేవీప్రద పండ దర్యాప్తు జరుపుతున్నారు.

కొరాపుట్‌కు పూరీ జగన్నాథ రథ చక్రం

- భక్తుల ప్రత్యేక పూజలు



కొరాపుట్ చేరుకున్న పూరీ రథ చక్రానికి పూజలు చేస్తున్న భక్తులు

కొరాపుట్: విశ్వవిఖ్యాత పూరీ దివ్య క్షేత్రంలో జగన్నాథ రథా యాత్రలో రథానికి ఉండే చక్రం కొరాపుట్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. మంగళవారం ఉదయం కొరాపుట్ పట్టణం పొలి మేరల నుంచి ఊరేగింపుగా రథ చక్రాన్ని భక్తులు తీసుకొని వచ్చారు. సంకీర్తన మండళ్లు, భజనల మధ్య కొరాపుట్ శబరి శ్రీక్షేత్రం లోనికి చేర్చారు. మందిరంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఉంచి పూజలు చేశారు. ఈ రథ చక్రం శాశ్వతంగా కొరాపుట్‌లో కొలువు తీరనుంది. ఏటా పూరీ రథాయాత్ర అనంతరం రథం విడిభాగాలు వేలం వేస్తారు. వీటిని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జగన్నాథ భక్తులు స్వాధీనం చేసుకొని తీసుకొని వెళ్తారు. పూరీ రథాన్ని పూజించిన, చక్రాన్ని పూజించినా ఒక్కటేనని భక్తుల విశ్వాసం. గతంలో పూరీలో జగన్నాథ విగ్రహం తయారు చేసినప్పుడు మిగిలిన సామగ్రిని కొరాపుట్ జగన్నాథవిగ్రహం తయారీకి వినియోగించారు. ఈ నేపథ్యంలో కొరాపుట్ జగన్నాథ దేవాలయ కమిటీ పూరీ జగన్నాథ రథ చక్రాన్ని వేలంలో కాకుండా ఉచితంగా ఇవ్వాలని పూరీ శ్రీమందిర క్షేత్ర కమిటీకి విజ్ఞప్తి చేసింది. వీరి వినతిని మన్నించి చక్రాన్ని ఉచితంగా ఇచ్చింది. గతంలో సునాబెడాలో ఎస్‌డీపీవోగా పని చేసి ప్రస్తుతం కలహండి జిల్లా జునాఘఢ్ ఎస్‌డీపీవోగా పని చేస్తున్న మనోజ్ కుమార్ బెహరా తనసొంత ఖర్చులతో రథ చక్రాన్ని కొరాపుట్ తెప్పించారు.

బార్ అసోసియేషన్ విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పర్లాకిమిడి: న్యాయవాది పత్తి రామారావుపై యాసిడ్ దాడిని నిరసిస్తూ పర్లాకిమిడి బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వరూప్ పాలో, కార్యదర్శి రామకృష్ణ నాయక్ (బబులీ), మాజీ అధ్యక్షుడు సిద్ధేశ్వర మిశ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వరూప్ కుమార్ పాలో మాట్లాడుతూ.. దాడి చేసిన నిందితులను పోలీసులు తక్షణమే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడి మెడికల్ ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేయాలని కోరారు. న్యాయవాదులకు భద్రత విషయంలో హైకోర్టు, సుప్రీంకోర్టు దీనిపై చట్టం తీసుకురావాలని ప్రతిపాదించారు. న్యాయవాదుల విధుల బహిష్కరణతో జిల్లా కోర్టులో పలు కేసులు వాయిదా పడ్డాయి.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



కలపతో పట్టుబడిన నిందితులతో అటవీ సిబ్బంది

జయపురం: జయపురం అటవీ డివిజన్ ఏసీఎఫ్ అమిత్ ప్రకాశ్ నాయిక్ నేతృత్వంలో అటవీ విభాగ టీమ్ జయపురం, బొయిపరిగుడ అటవీ ప్రాంతాల్లో మంగళవార దాడులు నిర్వహించారు. దాడుల్లో 60 గుగ్గిలం బల్లలు పట్టుకున్నట్లు వాటి విలువ రూ.ఒక లక్షకు పైనే ఉంటుందని ఏసీఎఫ్ నాయిక్ వెల్లడించారు. ఆయన వివరణ ప్రకారం.. బొయిపరిగుడ అటవీ ప్రాంతం కాటపడ రేంజ్ పరిధిలోని కెందుపుట్ అడవిలో కలప తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు.. జయపురం ఏసీఎఫ్ అమిత్ ప్రకాశ్ నాయిక్ జయపురం అటవీ రేంజర్ సచ్చిదానంద పొరిడ, బొయిపరిగుడ అటవీ విభాగ రేంజర్ సందీప్ కుమార్ పాణిగ్రాహి, ఫారెస్టర్ రవీంద్ర కుమార్ ప్రధాన్‌లు పారా సిబ్బందితో ఒక టీమ్‌గా ఏర్పడి దాడికి ప్రణాళిక రచించారు. ఆ టీమ్ ఖెందుగుడ అడవి వైపు వెళ్తుండగా ఒక వ్యాన్ వెళ్లడం గమనించి ఆపి తనిఖీ చేయగా 60 బల్లలు దొరికాయి. వెంటనే వ్యాన్ డ్రైవర్‌తో పాటు మరొకరిని అరెస్టు చేసి కలపతో ఉన్న వ్యాన్‌ను బొయిపరిగుడ అటవీ విభాగ కార్యాలయానికి తీసుకువెళ్లారు. వీరి ముండిగుడ సమీపంలోని కలాపడ వాసులు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురిపై ఎన్‌బీడబ్ల్యూ జారీ



కేసు వివరాలను వివరిస్తున్న న్యాయవాది తాండి

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కర రావుతో పాటు మరో ఐదుగురిపై నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ) జారీ అయ్యింది. ఎస్‌డీజేఎం జడ్జి వర్షాదాస్ ఈ మేరకు మంగళవారం జారీ చేశారు. మిగతా ఐదుగురిలో బీజేపీ నాయకుడు యాళ్ల కొండబాబు అలియాస్ వై.వేంకటేశ్వర రావు, ఇప్పిలి సన్యాసిరాజు, ఎస్.ఆదినారాయణ, పి.దిలీప్ కుమార్, కృష్ణారావులు ఉన్నట్లు బాధితుల తరుపు న్యాయవాది సామ్యూల్ తాండి మీడియా ప్రతినిధులకు వివరాలను వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, మజ్జిగౌరి మందిరం ట్రస్టు కమిటీ మాజీ సభ్యుడు భగీరథి మండంగి అనే వ్యక్తి 2010 డిసెంబర్ 15వ తేదీన హత్యకు గురయ్యాడు. ఆయన మృతదేహాన్ని పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర సరిహద్దులో ఒక రిజర్వాయర్ వద్ద కాలిన దేహంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాధిత కుటుంబీకులు భగీరథి హత్యకు సంబంధించి కేసు నమోదు చేశారు. అయితే కేసు దర్యాప్తులో ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధిత కుటుంబీకులు కేసును క్రైం బ్రాంచ్‌కు అప్పగించాలని అప్పట్లో పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం ఆదివాసీ మహాసంఘం తరుపున హత్యకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు. దీంతో సుదీర్ఘ 14 ఏళ్ల తర్వాత కేసుకు సంబంధించి ఎస్‌డీజేఎం కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడం విశేషం.

చంద్రపూర్‌లో వినతుల స్వీకరణ



వినతులను వింటున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో మంగళవారం వినతుల స్వీకరణ కార్యక్రమం జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా ఆధ్వర్యంలో నిర్వహించారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, చంద్రపూర్ బీడీఓ కృష్ణచంద్ర దళపతి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 68 వినతులను స్వీకరించిన అధికారులు ఇందులో 53 వ్యక్తిగత సమస్యలుగా గుర్తించి మరో 15 గ్రామసమస్యలుగా గుర్తించారు. ఆవాస్ గృహాలు, మౌలిక సౌకర్యాలు, సాగునీరు, అంగన్‌వాడీ గృహాల నిర్మాణం వంటివి ప్రధాన సమస్యలుగా గుర్తించిన అధికారులు వాటిని సత్వరంగా పరిశీలించి సమాధాన పరచాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు.

వ్యవసాయ పనుల్లో ఎమ్మెల్యే రంధారి



వరికోత కోస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రంధారి



వరి కంకులు మోస్తున్న దృశ్యం

కొరాపుట్: బీజేడీ పార్టీకి చెందిన నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం నియోజకవర్గ ఎమ్మెల్యే మనోహర్ రంధారి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతిరోజూ ప్రజాక్షేత్రంకి వెళ్లే ముందు తన స్వగ్రామం బట్టిగాంలో పొలాల వద్దకు వెళ్లడం, తన పొలంలో ఖరీఫ్ పంట కోస్తున్న వ్యవసాయ కూలీలతో కలిసి పనులు చేయడం చేస్తున్నారు. తాను గిరిజన వ్యవసాయ కుటుంబంలో పుట్టానని, నాలుగు సార్లు ఎమ్మెల్యే అయినప్పటికీ వ్యవసాయ పనుల సీజన్‌లో రైతుగా పని చేయకపోతే అసంతృప్తిగా ఉంటుందని పేర్కొన్నారు.

బకాయిలు అందజేయాలని ఆందోళన



ఆందోళన చేపడుతున్న కలప వ్యాపారులు

జయపురం: సమితిలోని గగణాపూర్ సేవా పేపరు మిల్లు ప్రధాన గేటు ముందు కలప సప్లయ్ వ్యాపారులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పేపరు మిల్లుకు నీలగిరి కలప సరఫరా చేసిన తమకు దాదాపు రూ.9 కోట్లు యాజమాన్యం బకాయి పడిందని, ఎన్నిసార్లు అడుగుతున్నా చెల్లించడం లేదని ఆరోపించారు. మిల్లు యాజమాన్యం తమకు డబ్బు చెల్లించకపోవడంతో రైతులు తమ ఇళ్లకు వచ్చి డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు యాజమాన్యం బకాయిలు చెల్లించకపోవడం వలన తాము సమస్యల్లో చిక్కుకున్నామని వాపోయారు. ఈనెల 18వ తేదీలోగా తమ డబ్బు చెల్లించకపోతే 20వ తేదీ నుంచి నిరవధికంగా ఆందోళన జరుపుతామని హెచ్చరించారు. అయితే మిల్లు యాజమాన్య ప్రతినిధి ఎస్.కె.గుప్త ఆందోళనకారులతో చర్చలు జరిపి రెండు రోజుల్లో రూ.కోటి చెల్లిస్తామని, అనంతరం మిగతా డబ్బు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వ్యాపారులు ఆందోళన విరమించారు. ఈ చర్చల్లో కలప వ్యాపారుల ప్రతినిధులు బాబుల నాయిక్, రమేష్ కుమార్, సంతోష్ నాయిక్, అభి పట్నాయిక్, ఎస్.ఎన్.సైని, బాబుల పాత్రో తదితరులు పాల్గొన్నారు.

• ఏనుగుల బీభత్సం



ధ్వంసమైన వరిపంట



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ధమునిపొంగ పంచాయతీ పరిధి ముండగా గ్రామంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన కేతకి గురు, ఘసి గురు, సదానంద దిసారి, ఒంటిరి అరుణ కుమారి, బాడుగి, మెలిటి కృష్ణ, బాడు బంగిరియా, విభీషణ గురు తదితర రైతుల పంటను ధ్వంసం చేశాయి. గత కొద్ది రోజులుగా సరిహద్దు జిల్లా కలహండి అడవుల నుంచి ఒక ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో అవి గ్రామాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి పంటలు చేతికి వచ్చే సమయానికి ధ్వంసమవ్వడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఏనుగులను తరిమేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకపోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితిలో సీలేరు నది ఒడ్డున ఉన్న లలితాదేవి ఆలయంలో మంగళవారం ప్రబోధిని ఏకాదశి సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సుప్రభాత సేవ చేశారు. 8 నుంచి 9 గంటల వరకు ఊరేగింపు 9 నుంచి 11 గంటల వరకు కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీ మందిరంలోనికి హిందూయేతర వ్యక్తి ప్రవేశం

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలోనికి హిందూయేతర మహిళ ప్రవేశించింది. మందిరం పరిసరాల్లో ఆమె కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో ఆమెతో మాట్లాడగా హిందువు కాదని తెలిసింది. దీంతో సింహద్వారం బయట తాత్కాలిక పోలీసు శిబిరానికి తరలించి ప్రశ్నించారు. అనంతరం ఆమెని విడిచిపెట్టి మందిరం గర్భ గుడిలోనికి ప్రవేశించడం నివారించారు.

12 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకొని వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వారి వద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో హరియాణకు చెందిన రోహిత్ నగర్, రామనిబాస్ జోగిలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

కల్వర్టులో పడి బాలుడు మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి మోటాంగూఢ నుంచి పల్లగూఢ మధ్య ఉన్న కల్వర్టు కింద నీటిలో పడి మంగళవారం ఏడేళ్ల బాలుడు అమృత్ మృతి చెందాడు. పోడియా కేంద్రంలో నివాసం ఉంటున్న బి.ఆకాశరావు ఆయన భార్యతో కలిసి పొలానికి వెళ్లారు. ఈ పొలానికి వెళ్లే దారిలోనే కల్వర్టు ఉంది. వారి కుమారుడు పొలానికి వస్తూ కల్వర్టు దాటబోయి కాలుజారి నీటిలో పడిపోయాడు. కొంత సేపటికి అటుగా వస్తున్న లిటు అనే యువకుడు బాలుడిని గమనించి పోడియా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో మాంత్ బెహరా తన సిబ్బందితో కల్వర్టు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోడియా ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా బాలుడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామానికి చెందిన కర్రి ఆదిలక్ష్మి(58) విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాండ్రంగి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి ఈ నెల 6వ తేదీన ఉచిత గ్యాస్ పథకం కోసం ఈకేవైసీ చేసుకునేందుకు తన కుమారుడు సూరిబాబుతో కలిసి బైకుపై భోగాపురం వచ్చింది. భోగాపురంలోని శ్రీసాయి దుర్గా గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ చేయించుకుని తిరిగి కుమారుడుతో కలిసి పాండ్రంగి బయలు దేరారు. మార్గం మధ్యలో సవరవల్లి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో కుమారుడు సూరిబాబు అక్కడికక్కడే చనిపోయాడు. తల్లి ఆదిలక్ష్మి తీవ్ర గాయాల పాలైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన ఆదిలక్ష్మిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఆదిలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ టీఎస్ఎన్ రాజు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నామ సంకీర్తన



ఓం వీరబ్రహ్మం గోవింద నారాయణ ఏకాహం నామ సంకీర్తనల ప్రాధాన్యతపై ప్రసంగిస్తున్న ఆచారి

జయపురం: జయపురంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకనామ సంకీర్తనలు జరిగాయి. ఉదయం 6.15 నుంచి సాయంత్రం 6.15 గంటల వరకు స్థానిక బెల్ రోడ్డులోని ఆలయ ప్రాంగణంలో 'ఓం వీర బ్రహం గోవింద నారాయణ' ఏకాహం నామ సంకీర్తనల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం విశ్వ శాంతి కోసం యజ్ఞం నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త ముగడ



నామ సంకీర్తనలలో పాల్గొన్న ప్రజలు

సూర్యనారాయణ ఆచారి ఓం వీరబ్రహ్మం గోవింద నారాయణ ఏకాహం నామ సంకీర్తనల ప్రాధాన్యతపై వివరించారు.



ఆలయంలో శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహం

రైలు ప్రమాదాల్లో ఏనుగుల మృతిపై విచారణ

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల కాలంలో రైళ్లు ఢీకొని ఏనుగులు దుర్మరణం పాలవుతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ విచారకర పరిస్థితులపై ఆరా తీసేందుకు రాష్ట్ర అటవీ పర్యావరణం, వాతావరణ మార్పు శాఖ నడుం బిగించింది. ఇటీవల సంభవించిన సంఘటనలపై మృతులకు కారణమైన అధికారులపై సమగ్ర విచారణ నిర్వహించి క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు విభాగం రంగం సిద్ధం చేస్తుందని విభాగం మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా తెలిపారు. ఈ ఏడాది గత నెలలో మెరామండలి, ఢెంకనాల్ ప్రాంతాల్లో రైలు పట్టాలపై 2 ఏనుగులు మృతి చెందాయి. పట్టాలు దాటుతుండగా రైళ్లు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. రైల్వే, అటవీ, పర్యావరణ విభాగపు అధికారుల నిర్లక్ష్యంతో ఈ విచారకర పరిస్థితులు తలెత్తుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ రెండు విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే ఈ మరణాలకు అడ్డుకట్ట పడుతుందని భావించి కార్యాచరణకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణకు అటవీ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి సత్యవ్రత సాహుకు మంత్రి ఆదేశించారు. 15 రోజుల్లోగా ఈ మేరకు విభాగానికి సమగ్ర నివేదిక దాఖలు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా బాధ్యులైన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వ్యతిరేకంగా క్రమశిక్షణా చర్యలు చేపడతారని మంత్రి స్పష్టం చేశారు.

కారుణ్య నియామకాలపై హామీ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది సంక్షేమ కార్యకలాపాల్లో స్వల్ప సంస్కరణలు చేపడుతున్నారు. ప్రధానంగా అకాల మరణానికి గురైన సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుంది. కారుణ్య కోటా కింద మృత సిబ్బంది కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ప్రాధాన్యత కల్పిస్తారు. అనివార్య పరిస్థితుల్లో కారుణ్య కోటా ఉద్యోగం కల్పించ లేని పరిస్థితుల్లో బాధిత కుటుంబీకుల్లో భారీ మొత్తంలో ఏకవిడత ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. ఈ మేరకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు.

రుతుక్రమ సెలవుల నియామావళి జారీ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సిబ్బందికి ప్రత్యేక సెలవు దినాలు ప్రకటించింది. ఏటా 12 రోజుల రుతుక్రమ సెలవులు ప్రకటించింది. ఇది 55 ఏళ్లలోపు వారి వర్తిస్తుంది. మహిళా ఉద్యోగులకు నెలవారీ రుతుక్రమం సమయంలో శారీరిక అసౌకర్యం పరిగణనలోకి తీసుకుని అదనపు క్యాజువల్ లీవు మంజూరుకు సంబంధించి ఉత్తర్వు జారీ చేసింది. మహిళా ఉద్యోగులకు ఏటా 12 ప్రత్యేక సెలవు మంజూరు అవుతున్నాయి. లోగడ 10 రోజుల రుతుక్రమ సెలవు ప్రకటించింది. ఈ ఉత్తర్వులు సవరించి మరో రెండు రోజులు పొడిగించారు. దీనిని అదనపు సాధారణ సెలవు దినంగా పరిగణిస్తారు. నెలఖారులోగా ఈ సెలవు వినియోగించుకోని పరిస్థితుల్లో రద్దు అవుతాయి. ఒక నెలలో వినియోగించని ఈ సెలవు మరుసటి నెలకు విస్తరించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇతర సెలవు దినాలు యథావిధిగా వర్తింపజేసి కొనసాగిస్తారు.

జిరంగో ఉన్నత పాఠశాలలో బాలవిజ్ఞాన ప్రదర్శన



విజ్ఞాన ప్రదర్శనలో బహుమతి ప్రధానోత్సవంలో న్యాయనిర్ణేతలు, విజేతలు

పర్లాకిమిడి: రాయగడ బ్లాక్ జిరంగో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలవిజ్ఞాన ప్రదర్శనను మంగళవారం బ్లాక్ విద్యాధికారి టి.కిశోర్ ప్రారంభించారు. మరో అతిథిగా ఏడీఓ పాపారావు విచ్చేయగా జిరంగో ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సునాం చరణ్‌పోరిచ్చా అధ్యక్షత వహించారు. ఈ ప్రదర్శనకు వివిధ పంచాయతీల నుంచి 15 సైన్సు ప్రాజెక్టులు రాగా వాటిలో ఏడు సీనియర్ స్థాయి, 3 ప్రాజెక్టులు జూనియర్ స్థాయి, సబ్ జూనియర్ స్థాయిలో 3 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. వాటిలో ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు తయారుచేసిన నారాయణపూర్ హైస్కూల్ విద్యార్థి ఫినోస్ శబర, ఆరోగ్యకరమైన ఆహారం పై ప్రదర్శించిన తొమ్మిదో తరగతి విద్యార్థి చందన్ భుయ్యాన్, పిత్తబాస్ రౌత రవాణా ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. సబ్ జూనియర్ స్థాయిలో జిరామిన్ ప్రియమిత్రా తయారుచేసిన చెత్త రీసైక్లింగ్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి, ద్వితీయ సరస్వతీ శోబోరో, ప్రకృతి సేంద్రియ వ్యవసాయం ప్రాజెక్టు జ్యోత్సరాణి భుయ్యాన్‌కు తృతీయ బహుమతి లభించింది. బహుమతి ప్రధాన సభలో బి.ఈ.ఓ.కిషోర్, పాపారావు, పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా హరిహర దాస్, సుజాతా బెహెరా వ్యవహరించారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో భూములు లాక్కొనే కుట్ర

- ఏపీసీసీ మైనారిటీ వైస్ చైర్మన్ హుస్సేన్ షరీఫ్

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు పేరుతో ముస్లింలు అల్లాహ్ మార్గంలో త్యాగం చేసినటువంటి లక్షల ఎకరాల భూములను, రూ.లక్షల కోట్ల ఆస్తులను జప్తు చేసుకునే దురుద్దేశంతో అడుగులు వేస్తుందని ఏపీసీసీ మైనారిటీ వైస్ చైర్మన్ హుస్సేన్ షరీఫ్ అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సవరణ పేరుతో ముస్లింల అధీనం నుంచి వాటిని లాక్కొని ముస్లింలకు ఏమాత్రం హక్కు లేకుండా చేసి వాటిని బడాబాబులకు అప్పజెప్పే అధికారిక కుట్ర జరుగుతుందని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులను, వక్ఫ్ బోర్డును కాపాడుకోవాలన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అమోదం చెందకుండా న్యాయ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ ఖలీల్, అబ్దుల్ రెహమాన్, ఎస్.కె.సమీర్, ఎస్.కె.మక్బుల్, ఎస్.కె సిలర్, నూరిబేగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ షరీఫ్

సైబర్ నేరాలపై అప్రమత్తం

- డీఐజీ గోపీపినాథ్ జెట్టీ

పూసపాటిరేగ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలపై ఆరా తీశారు. అనంతరం మహిళాసంరక్షణ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి నేరం జరిగినా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మహిళసంరక్షణ కార్యదర్శులదేనన్నారు. ఆయా గ్రామాల్లో నేరచరిత్ర ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతను గుర్తించి సన్మార్గంలో నడిచే విధంగా కృషి చేయాలని చెప్పారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడం నేరమని వచ్చిన పోస్టులును వేరే వ్యక్తులకు పంపించడం కూడా నేరమేనన్నారు. గ్రామాల్లో నిఘా ఉంచి ఎటువంటి నేరాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరగకుండా నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాల చలామణి వివరాలు తెలిసినట్లయితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సీఐ డి.రామకృష్ణ, ఎస్సైలు ఐ.దుర్గాప్రసాద్, గణేష్, ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ తదితరులు

బడగుడలో వినతుల స్వీకరణ



ప్రజల వద్దకు వెళ్లి మాట్లాడుతున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ బడగుడ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, మోహనా సమితి అధ్యక్షులు రాజీవ్ శోబోరో, బీడీఓ రాజీవ్ దాస్, తహసీల్దార్ ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. శికులిపదర్, బడగుడ, లుహాగుడి, చాందిపుట్ పంచాయతీల నుంచి మొత్తం 102 వినతులు అందాయి.



మోహన బ్లాక్ బడగుడ పంచాయతీ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ

జిల్లా కోర్టులో చిత్రలేఖనం పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోర్టులో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిల్లా జడ్జి ప్రసన్నకుమార్ పండా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి స్టడీ టేబుళ్లు అందజేశారు. విజేతలకు బహుమతులను జిల్లా అదనపు జడ్జి శంతను కుమార్ దాస్ అందజేశారు.

గుడారిలో గంజాయి మొక్కల ధ్వంసం



గంజాయి మొక్కలను నాశనం చేస్తున్న అబ్కారీ సిబ్బంది

రాయగడ: జిల్లాలోని గుడారి పోలీస్ స్టేషన్ పరిధిలో గల దునమ, దుకుడాపంగ, ఖయిరాగుడ, నారింగి తదితర అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులను నిర్వహించి ధ్వంసం చేశారు. సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న 35 వేల మొక్కలకు నిప్పుపెట్టి తగులబెట్టారు.



గంజాయి మొక్కలను తగలబెడుతున్న దృశ్యం

లింక్ లేకుంటే రాయితీ రానట్టే..

- బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి చేసిన కేంద్రం
- ఈ నెల 6 నుంచి ప్రారంభమైన ప్రక్రియ

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించే రాయితీలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా) లింక్ తప్పనిసరి చేసింది. ఇటీవల వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్‌పీసీఐ లింకు ఉన్న ఖాతాలు లేకపోవటంతో ప్రభుత్వం నుంచి వారికి పథకాలు అందకుండా పోయాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో ఎన్‌పీసీఐ లింకులు లేని ఖాతాల జాబితాలను ఆయా ప్రాంతాల వారీగా పంపించింది. ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం మనుగడలో లేని ఖాతాలను తెరిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీలోగా పునరుద్ధరణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

విజయనగరం నియోజకవర్గంలో పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలతో పాటు కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో నివాసముంటున్న వారికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ వాటికి ఎన్‌పీసీఐ లింకు లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను డిజిటలైజేషన్ చేయాలని ఈ నెల 6వ తేదీన కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీని ప్రకారం లబ్ధిదారులతో పాటు 18 ఏళ్లు నిండిన వారంతా పోస్టాఫీసుల్లో కొత్త ఖాతాలను తెరవాలని చెబుతున్నారు. దీనిపై ఆయా సచివాలయ పరిధిలో వెల్ఫేర్, డిజిటల్, సర్వేయర్లు, అగ్రికల్చర్ సిబ్బంది సిద్ధం చేశారు. సచివాలయ సిబ్బంది ఇచ్చిన యాప్‌లో ఆయా ఖాతాలకు ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం వారి ఖాతాకు సంబంధిత బ్యాంకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు.



వార్డు సచివాలయంలో ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింక్ చేస్తున్న సిబ్బంది

బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖాతా మనుగడలో ఉండాలి. కొందరికి రెండు, మూడు బ్యాంక్ ఖాతాలు ఉండి వాటిలో కొన్ని వినియోగంలోకి లేకపోవటంతో సమస్యలు వస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి మనుగడలో లేని ఖాతాల వివరాలు పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టింది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 40వేలకు పైగా ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింక్ లేనట్లు గుర్తించాం. వారందరికీ సమాచారం అందించి లింక్ చేసుకోవాలని సూచిస్తున్నాం.

– పి.నల్లనయ్య, కమిషనర్ విజయనగరం కార్పొరేషన్

పన్ను చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగు నీటి పన్ను చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్ చేయనున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం నీటి పన్నుల వసూళ్లకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కార్పొరేషన్ సిబ్బంది బకాయిదారులకు వద్దకు వెళ్లి పన్ను వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇందుకోసం నియమించిన ప్రత్యేక సిబ్బందితో పాటు సచివాలయ కార్యదర్శులు వసూళ్లకు చేపడుతున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న వారంతా విధిగా పన్ను మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. నగర ప్రజలకు తాగునీటిని అందించే కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కోట్లాది రూపాయాలు వ్యయం చేయటం జరుగుతుందని, ఆర్థిక భారం పడకుండా ప్రజలు సహకరించి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.



నీటి పన్ను వసూళ్లలో కార్పొరేషన్ సిబ్బంది